వైఎస్ఆర్
# కడప వార్త
తెలుగు జాతీయ దినపత్రిక
ఆదివారం 26 ఏప్రిల్ 2026



## ఇసుక రీచ్ రద్దు చేయాలని మహా ధర్నా

సుండుపల్లి, ఏప్రిల్ 25,ప్రభాతవార్త :



మండల కేంద్రంలోని నాలుగు రోడ్ల కూడలిలో అక్రమ ఇసుక తవ్వకాలపై బహుదా నది పరివాక ప్రాంతానికి చెందిన గ్రామాల ప్రజలు, రైతులు, కూటమి నాయకులు పెద్ద ఎత్తున చేరుకుని ఇసుక రీచ్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల నుండి భారీగా తరలి వచ్చిన రైతులు, కార్యకర్తలు అక్రమ మైనింగ్‌ను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. నది తీర ప్రాంతాల్లో జరుగుతున్న నియంత్రణ లేని ఇసుక తవ్వకాల వల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. భూగర్భ జలాలు క్షీణిస్తున్నాయని, బోర్లు ఎండిపోతున్నాయని, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

2వ పేజీలో

## కడప నగర పరిశుభ్రతను కాపాడాలి

కడప కార్పొరేషన్ ఏప్రిల్ 25 ప్రభాతవార్త:



కడప నగరపాలక సంస్థ కమిషనర్ రాకేష్ చంద్ర శనివారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా 23వ డివిజన్‌లో పారిశుధ్య పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు. వీధుల్లో కొనసాగుతున్న డ్రైనేజీలో క్లీనింగ్ పనులను పరిశీలించి, సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ముఖ్యంగా మస్టర్ అటెండెన్స్‌ను తనిఖీ చేసి, సిబ్బంది సమయపాలనను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. అదేవిధంగా, రోడ్ల స్వీపింగ్ పనులను నిరంతరం నిర్వహించడంతో పాటు, డ్రైనేజీ కాలువల్లో చెత్త పేరుకుపోకుండా తరచూ డీసిల్టింగ్ పనులు చేపట్టాలని సూచించారు. కడప నగరంలో పరిశుభ్రతను కాపాడేందుకు అధికారులు అప్రమత్తంగా పని చేయాలని ఆదేశించారు.

జలధార కార్యక్రమాన్ని

# చక్కటి ప్రణాళికతో అమలు చేయాలి

మండల స్థాయి బృందాలు సమన్వయంతో ఉత్సాహంగా పనిచేయాలి జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి





కడప, ఏప్రిల్ 25 ప్రభాతవార్త :

నీటి భద్రతా కార్యక్రమంలో రైతులు, సాగునీటి సంఘాల భాగస్వాములతో జలధార కార్యక్రమాల ప్రణాళికలను మరింత ప్రాధాన్యతతో పటిష్టంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి నోడల్ అధికారులు, మండల స్థాయి బృందాల అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ లోని సభా భవన్ లో నుండి జిల్లా కలెక్టర్ డా. శ్రీదర్ చెరుకూరి 'జలధార జల హారతి, నీటి భద్రత అమలు ప్రణాళిక పై.. అన్ని మండలాల నోడల్ అధికారులు,ఎంపిడిఓ లు,ఇరిగేషన్, డ్వామా అధికారులు లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో భూగర్భ జలాలు మట్టాన్ని పెంపొందించడం, నీటి వనరులు సంరక్షణ, సాగునీటి వ్యవస్థ బలోపేతం లక్ష్యంగా క్షేత్రస్థాయిలో అవసరాలను గుర్తించాలన్నారు.అందులో భాగంగా నీటి వనరులను గుర్తించడం నీటి భద్రత, సాగునీటి పొదుపు, కొత్త ఆయకట్టు మదుపు,వాగులు, చెరువుల అనుసంధానం, సూక్ష్మ సేద్యం,వర్షపు నీటిని ఒడిసి పట్టడం తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మే 1వ తేదీ నుండి 30 వ తేదీ వరకు గ్రామాలవారీగా వారి పరిధిలోని చెరువుల్లో వారి సొంత అవసరాలకు మట్టిని తోలుకోవచ్చుని, కమర్షియల్‌గా కాకుండా వారి సొంత అవసరాలకు మట్టిని తోలు కోవచ్చునని తెలియజేసారు. ఈ విషయంలో గ్రామస్థులు వాణిజ్య అవసరాలకు కాకుండా కేవలం వారి సొంత అవసరాలు అంటే.. పొలాలకు మట్టి తోలడం, ఇంటి నిర్మాణం కోసం, గ్రామంలో అభివృద్ధి అవసరాలకు, ఇంటి పరిసరాల పనుల కోసం చెరువుల నుండి ఉచితంగా మట్టిని తోలుకోవచ్చున్నారు. కాగా ఈ ప్రక్రియలో గ్రామస్థులు సొంత అవసరాల కోసం, వారి సొంత ఖర్చుతోనే ఇరిగేషన్ అధికారులు సూచించిన డీసిల్టేషన్ నిబంధనల మేరకు మట్టి లెవెల్స్ ప్రకారం తవ్వుకోవచ్చున్నారు. సాగునీటి కాలువలు, చెరువులు గట్లను బలోపేతం చేయడం,కాలువల పూడిక తీత,లాక్స్ మరమ్మతులు వంటి పనులు చేపట్టాలన్నారు.గ్రామాల్లో చెక్ డ్యాములు,రోడ్డు పక్కన ఉన్న కాల్వల డైవర్షన్ వంటి పనులు చేసి ఉంటే గుర్తించి.. క్లియర్ చేసేందుకు ఎన్ఆర్ఈజిఎస్ ద్వారా పనులను ప్రతిపాదించాలన్నారు. పనుల గుర్తింపు, పనుల నిర్వహణ కు సంబంధించి జేసీబీలు,ఇతర సాంకేతిక పరికరాల అవసరాల నివేదికలను ఇవ్వాలన్నారు. గ్రామ పరిసరాల్లో ఉన్న చెరువులు,కుంటలు, కాల్వలలో పిచ్చి మొక్కలు, కంపచెట్లను తొలగింపు, చెరువులు,కాలువల అను సంధానం,భూగర్భ జలాల సంరక్షణ కోసం సూక్ష్మ నీటి సాగును ప్రోత్సహించడం స్లూయిజ్ కాల్వల రిపెరీపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కాస్కెట్ ట్యాంక్ లు,తాత్కాలికంగా మల్లింపు చేసిన కాలువలను గుర్తించి రిస్టోర్ చేయాలన్నారు. ఈ పనుల్లో ప్రజలు ముఖంగా మహిళా రైతులు,డ్వాక్రా మహిళలు భాగస్వామ్యంతో పనులను వేగవంతంగా, నాణ్యతగా చేపట్టాలన్నారు. జలవనరులుశాఖ, అటవీశాఖ, పంచాయతీ రాజ్, వ్యవసాయ,పశుసంవర్ధక శాఖలు, డ్వామా తదితర శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. సాగునీటి సంఘాలను పటిష్టం చేసే దిశగా సంబందిత అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. భూగర్భ జలాలను పెంపొందించే దిశ గా ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో డ్వామా పీడి ఆదిశేషారెడ్డి, జెడ్పి సీఈఓ రామచంద్రారెడ్డి, మైనర్ ఇరిగేషన్ ఎస్ఈ అబ్దుస్, గ్రౌండ్ వాటర్. డిడి మురళీధర్, సంబందిత శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో పెట్రోల్, డీజిల్ కొరత లేదు

జిల్లా జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా





కడప, ఏప్రిల్ 25 ప్రభాతవార్త :

జిల్లాలో పెట్రోల్, డీజిల్ వినియోగదారులకు ఎలాంటి ఇబ్బంది లేదని, ఆయిల్ కంపెనీ డిపోల నందు ప్రజల రోజువారీ అవసరాలకు సరిపడా ఇంధన నిల్వలు ఉన్నాయని జిల్లా జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా తెలిపారు. శనివారం కలెక్టరేట్ లోని తన ఛాంబర్‌లో జిల్లా జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా.. ఆయిల్ కంపెనీ సేల్స్ అధికారులు, పౌర సరఫరా అధికారులు మరియు పెట్రోలియము డీలర్లతో సమావేశము నిర్వహించారు. ఈ సందర్భముగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలోని మొత్తం పెట్రోల్ బంకులలో (ఐటీసీ65, బీపీసీఎల్58, హెచ్పీసీఎల్92, నయారా14, రిలియన్స్ జియో5) ఉన్నాయని తెలియజేశారు. ప్రైవేటు రంగ సంస్థలకు చెందిన బంకుల నందు పెట్రోలు/డీజిలు ధరలు పెరగడము వలన సదరు బంకుల్లో అధిక శాతం డీజిల్ విక్రయాలు తగ్గిపోయాయని, సదరు వినియోగదారులంతా ప్రభుత్వ రంగ సంస్థల బంకులకు వస్తున్నారన్నారు.దీంతో వినియోగం పెరిగడంతో గతంలో కాంట్రాక్టర్లు, ఇతర బల్క్ వినియోగదారులు గతంలో నేరుగా ఆయిల్ కంపెనీ నుండి డీజిల్ కొనుగోలు చేసేవారు. ప్రస్తుతం ధరలు పెంచడము వలన ఇప్పుడు వారంతా ప్రభుత్వ రంగ డీలర్ల నుంచి డీజిల్ కొనుగోలు చేస్తున్నారన్నారు. పరిశ్రమల అవసరాలకు సరఫరా చేసే డీజిల్ ధర లీటరుకు రూ.152 వరకు చేరింది. దీంతో వీరు కూడా ప్రభుత్వ రంగ బంకుల్లోనే డీజిల్ కొంటున్నారు. పెట్రోలు కొరత లేదని కాని భయంతో వాహనదారులు అవసరానికి మించి కొనుగోలు చేస్తున్నారు. అధికశాతం మంది ఫుల్ ట్యాంక్ చేయిస్తున్నారు. ఈ నేపథ్యంలో వాహనదారులు ఎవరూ ఇంధన కొరత వస్తుందని ఆందోళన చెందాల్సిన పనిలేదని, ఆందోళనతో అవసరానికి మించి కొనుగోలు చేసి నిల్వ చేసుకోవద్దని విజ్ఞప్తి చేశారు. అపోహలకు లోనుకాకుండా ప్రజలు ఎప్పట్లాగే తమ సాధారణ వినియోగాన్ని కొనసాగించాలని కోరారు. ఒకవేళ ఎక్కడైనా బంకుల్లో ఇంధనం తక్కువైతే వెంటనే అక్కడ నిల్వలు అందుబాటులోకి తెచ్చేలా త్వరితగతిన చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఇందు కొరకు డీలర్లు కూడా టోల్ ఫ్రీ నెంబరు 1967 కు ఫోను చేసి నిల్వలు అయిపోయిన విషయము ప్రభుత్వ దృష్టి తీసుకొని రావచ్చునని తెలియజేశారు. డీలర్లు పెట్రోల్, డీజిల్ అనవసరంగా కొనుగోలు చేసి నిల్వలు దాచిపెట్టి, బ్లాక్ మార్కెటింగ్ కు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జాయింట్ కలెక్టర్ ఆ ప్రకటనలో తేల్చి చెప్పారు. అలాగే కడప జిల్లాలో పెట్రోల్, డీజిల్ వినియోగదారులకు ఎలాంటి ఇబ్బంది లేదని, ఆయిల్ కంపెనీ డిపోల నందు ప్రజల రోజువారీ అవసరాలకు సరిపడా ఇంధన నిల్వలు ఉన్నాయని జిల్లా జాయింట్ కలెక్టర్ తెలిపారు.

హత్యకు సూత్ర దారులు

# కుట్రదారులు వైసీపీ నాయకులే

దస్తగిరి హత్యకు ఆర్థిక లావాదేవీలే కారణం

రూ.200 కోట్ల ఆస్తి పత్రాలు స్వాధీనం అయ్యాయని వెల్లడి

గంజాయి ముఠాకి అంటగట్టే ప్రయత్నం

ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి



పులివెందుల, ఏప్రిల్ 25, ప్రభాతవార్త :

జిల్లా కేంద్రంలో రిమ్స్ వద్ద జరిగిన వైసీపీ నాయకుడు దస్తగిరి హత్యకు సూత్రధారులు పాత్రధారులు కడపకు చెందిన వైసిపి మాజీ ప్రజా ప్రతినిధులేనని, దస్తగిరి హత్యకు ఆర్థిక లావాదేవీలే కారణమని అందుకు నిదర్శనం దస్తగిరి ఇంట్లో దొరికిన 200 కోట్ల విలువ ఆస్తి పత్రాలని, మీడియా ద్వారా తప్పుదోవ పట్టించేందుకు హత్య జరిగిన రోజే గంజాయి ముఠా హత్య అంటూ ప్రధాన శీర్షికగా తప్పుడు కథనాలు ప్రచురించడం జరిగిందని అసలైన నిందితులపై పట్టిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి అన్నారు. పులివెందుల పట్టణంలో శాసనమండలి సభ్యుడు భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి తన నివాసంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో పెద్ద దస్తగిరి హత్యపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దస్తగిరి హత్యకు ఆర్థిక లావాదేవీలే ప్రధాన కారణమని ఆరోపించారు. వైఎస్ఆర్సిపి నాయకులతో దస్తగిరికి భారీ స్థాయిలో ఆర్థిక లావాదేవీలు జరిగాయని, వాటిలో ఏర్పడిన విభేదాల కారణంగానే హత్య జరిగిందని ఆయన పేర్కొన్నారు. హత్యను గంజాయి మత్తులో జరిగిన ఘటనగా చూపిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. అంతేకాకుండా, గతంలో వైఎస్ఆర్సిపి ప్రభుత్వ కాలంలో దస్తగిరి పేరుపై కోట్ల విలువైన ప్రభుత్వ భూములను నమోదు చేసి, వాటిని ప్లాట్లుగా మార్చి విక్రయించినట్లు ఆరోపించారు. ఈ లావాదేవీలలో పలువురు కీలక నాయకుల ప్రమేయం ఉన్నదని ఆయన అన్నారు. మాజీ కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డికు కడప నగరంలో భారీ ఇల్లు నిర్మించేందుకు దస్తగిరి సహకరించాడని కూడా ఆయన ఆరోపించారు. దస్తగిరి ఇంటి సమీపంలోనే నివసిస్తున్నప్పటికీ, ఆయన కుటుంబాన్ని ఇప్పటివరకు పరామర్శించలేదని విమర్శించారు. ఒక దళితుని యొక్క 1.50 సెంట్ల భూమిని కూడా ఆక్రమించి ఎన్ఓసి తీసుకుని కోట్ల రూపాయలు దోచుకున్నారన్నారు. వైసీపీ నాయకుడు నిత్యాకు మరియు మేయర్ సురేష్ కు ఎమ్మెల్యే రవీంద్రారెడ్డికి పెద్ద దస్తగిరికి మధ్య కోట్ల రూపాయలు భూముల కొనుగోలు విక్రయాలలో ఆర్థిక లావాదేవీలు జరిగాయని అందులో భాగంగానే హత్య చేయించారన్నారు. దస్తగిరి నివాసంలో నిర్వహించిన సోదాల్లో సుమారు రూ.200 కోట్ల విలువ చేసే ఆస్తి పత్రాలను రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, నిజానిజాలు బయట పెట్టాలని పోలీసులను కోరారు. జిల్లాలోని పొద్దుటూరు, రాయచోటి ప్రాంతాల్లో గత ప్రభుత్వంలో ప్రభుత్వ భూములకు అనుమతులు ఇచ్చిన అంశంపై కూడా విచారణ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

## మలేరియా రహిత సమాజమే లక్ష్యం

రాజంపేట, ఏప్రిల్ 25 ప్రభాతవార్త

మలేరియా రహిత సమాజమే లక్ష్యంగా పనిచేయాలని వైద్యులు పిలుపునిచ్చారు. శనివారం ప్రపంచ మలేరియా దినోత్సవం పురస్కరించుకొని " ఇప్పుడు మనం సాధించగలం ఇప్పుడు మనం తప్పక సాధించాలి " అనే నినాదం తో మన్నూరు అర్బన్ హెల్త్ క్లినిక్ డాక్టర్ దుర్గా మల్లేశ్వర్ , అకేపాడు డాక్టర్ బ్రాహ్మంద్ర, ఏరియా హాస్పిటల్ డాక్టర్ నరేష్ డాక్టర్ మహేష్ ఆధ్వర్యంలో రాజంపేట ఏరియా హాస్పిటల్ నుండి ఆరోగ్య సిబ్బంది ద్వారా అవగాహన ర్యాలీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బ్రాహ్మంద్ర మాట్లాడుతూ మలేరియా నిర్మూలన అనేది కేవలం ఆరోగ్య శాఖ భాద్యత కాదు, అది ఒక సామాజిక భాద్యత,ప్రతి ఒక్కరు తమ పరిసరాలను పరిశుభ్రముగా ఉంచుకోవాలి, ఇండ్లల్లో వారం కంటే ఎక్కువ రోజులు నిల్వ లేకుండా చూసుకోవాలని కోరారు.రాత్రి వేళల్లో దోమతేరులు వాడాలని సూచించారు. డాక్టర్ దుర్గా మల్లేశ్వర్ మాట్లాడుతూ చలి జ్వరం, తలనొప్పి,లక్షణాలు ఉంటే ఏ మాత్రము నిర్లక్ష్యం చేయకుండ వెంటనే ప్రభుత్వ హాస్పిటల్ ను సంప్రదించి రక్తపరీక్షలు చేయించుకోవాలి అని సూచించారు, డాక్టర్ నరేష్ మాట్లాడుతూ, క్షేతస్థాయిలో గ్రామాల లో నిరంతరం లార్వా నిర్మూలన చర్యలు, ఫీవర్ సర్వే లు నిర్వహించి ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమం ద్వారా గ్రామాలలో పట్టణాలల్లో నీటి నిల్వలను తొలగించి మలేరియా డెంగు గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, సబ్ యూనిట్ ఆఫీసర్ ఎస్.ఎస్. దాస్, ఆరోగ్య హెల్త్ విస్తరణ అధికారి శంకరనారాయణరాజు ఫిజియో తెరఫి , గుర్రప్ప, టీ బి సూపర్వైసోర్ ప్రకాష్ హెల్త్ సూపెర్వైసోర్ చెన్నమ్మ అర్బన్ హెల్త్ అసిస్టెంట్స్ , అకేపాడ్ హెల్త్ అసిస్టెంట్స్, ఏఎన్ఎం లు, ఆశలు పాల్గొన్నారు.



## జగన్మోహన్ రాజును కలిసిన ఒంటిమిట్ట సీఐ

రాజంపేట,ఏప్రిల్ 25 ప్రభాతవార్త



రాజంపేట పోలీస్ సభ్యులు పరిధిలోని ఒంటిమిట్ట సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు శనివారం టిడిపి రాజంపేట అసెంబ్లీ ఇంచార్జ్ చమర్తి జగన్మోహన్ రాజును కలిశారు. ఫోటో పెట్టి చేయగా బాధ్యతలు చేపట్టిన తర్వాత జగన్మోహన్ రాజు ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జగన్మోహన్ రాజు కొత్త సిఐ కి ఒంటిమిట్ట సర్కిల్ పరిధిలో శాంతిభద్రతలు పరిరక్షించాలని సూచించారు. ప్రజలకు మంచి సేవలు అందించాలని కోరారు.




# మళ్ళీ ప్రారంభమైన సోషల్ మీడియా కేసు విచారణ

8 గంటల పాటు సాగిన సజ్జల భార్గవ్ విచారణ

41ఏ నోటీసులతో విచారణకు హాజరు

కీలక అంశాలపై ప్రశ్నల వర్షం

నేడు మళ్లీ హాజరుకా వాలని నోటీసులు జారీ



విచారణకు హాజరై వస్తున్న భార్గవ్ రెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న డీఎస్పీ మురళి నాయక్

పులివెందుల ఏప్రిల్ 25, ప్రభాతవార్త :

సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టుల కేసు మరోసారి తెరపైకి వచ్చింది. ఈ కేసులో ఏ 2 నిందితుడిగా ఉన్న సజ్జల భార్గవ్ రెడ్డి శనివారం పులివెందుల డీఎస్పీ కార్యాలయంలో విచారణకు హాజరయ్యారు. పోలీసులు సుమారు 8 గంటల పాటు అతన్ని విచారించారు.గతంలో మందకృష్ణ మాదిగ, లోకేష్, పవన్ కళ్యాణ్ తదితరులపై సోషల్ మీడియాలో అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడంతో పాటు పుల్లప్ప గారి హరిని కులం పేరుతో దూషించారనే ఆరోపణలపై 2024 నవంబర్ 8న పులివెందుల పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నంబర్ 409/24 నమోదు చేశారు. అలాగే రాజంపేట పోలీస్ స్టేషన్‌లో వంకపల్లి వేంకటాద్రి దూషించిన ఆరోపణల పై నమోదు అయిన 411 /24జీరో ఎఫ్ఐఆర్ కేసులలోఏ1గా వర్ర రవీంద్ర రెడ్డి, ఏ2గా సజ్జల భార్గవ్ రెడ్డి ఉన్నారు. ఇప్పటికే ఈ కేసులో 35 మందిని పోలీసులు విచారించారు. రవీంద్ర రెడ్డి ఇచ్చిన సమాచారం ఆధారంగా మొత్తం 77 మందిపై కేసులు నమోదు చేశారు. వర్ర రవీంద్రను అరెస్ట్ చేయగా, భార్గవ్ రెడ్డికి కేసుకు పోలీసులు విచారణకు ఎపుడు పిలిచిన సహకరిం చాలని నిబంధనతో కోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది.ఈ నేపథ్యంలో పోలీసులు 41ఏ నోటీసులు జారీ చేసి భార్గవ్‌ను విచారణకు పిలిచారు. శనివారం ఉదయం 10 గంటలకు విచారణకు హాజరైన భార్గవ్‌ను డీఎస్పీ మురళి నాయక్ ఆధ్వర్యంలో సీఐ నరసింహులు, క్రైమ్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ మధు మల్లేశ్వర్ రెడ్డి తదితరులు ప్రశ్నించారు. విచారణ సందర్భంగా కీలక అంశాలపై ప్రశ్నలు అడిగి, అతని స్టేట్మెంట్‌ను ఆడియో, వీడియో రూపంలో రికార్డు చేశారు. విచారణ అనంతరం న్యాయవాది ఓబుల్ రెడ్డి మాట్లాడుతూ సోషల్ మీడియా కేసుకు సంబంధించి 41 ఏ నోటీసులను పోలీసులు జారీ చేయడంతో భార్గవ్ రెడ్డి విచారణ హాజరయ్యారని మొత్తం రెండు కేసులలో విచారణకు పిలిపించారని నేడు మధ్యాహ్నం రెండు గంటలకు మరోసారి విచారణకు రావాలని నోటీస్ జారీ చేశారని అలాగే బి కొత్తకోట పోలీస్ స్టేషన్ నందు నమోదైన మరో కేసులో 27వ తేదీ విచారణకు హాజరుకావా లని 41 నోటీసు జారీ చేశారని అన్నారు. కోర్టు ఇచ్చిన నిబంధనల మేరకే విచారణకు హాజరయ్యామన్నారు.

విచారణ అనంతరం డీఎస్పీ మురళి నాయక్ మాట్లాడు తూ, భార్గవ్ న్యాయవాది ఓబుల్ రెడ్డి సమక్షంలో విచారణకు హాజరైనట్లు తెలిపారు. రెవెన్యూ అధికారుల సమక్షంలో పలు ప్రశ్నలు అడిగినట్లు, కొన్నింటికి సమాధానాలు ఇచ్చారని, మరికొన్ని ప్రశ్నలకు సమాధానం ఇవ్వకుండా దాటవేసారు అని తెలిపారు. క్రైమ్ నెంబర్ 409 /24 లో మొత్తం 77 మంది పైన 411/24 లో 3 పైన కేసు నమోదు అయిందని తెలిపారు. అలాగే కేసుకు సంబంధించి ఉపయోగించిన సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్‌లను ఇవ్వాలని కోరగా, కోర్టు ఆదేశాలు వస్తే ఇస్తానని భార్గవ్ సమాధానం ఇచ్చినట్లు తెలిపారు.మరోసారి ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు విచారణకు హాజరుకావాలని 41ఏ నోటీసులు జారీ చేసినట్లు చెప్పారు. భార్గవ్ ఇచ్చే సమాచారంపై ఆధారపడి కేసులో మరి కొందరిని చేర్చే అవకాశం ఉందని, విచారణను త్వరగా పూర్తి చేస్తామని డీఎస్పీ పేర్కొన్నారు. విచారణకు సజ్జన భార్గవ్ రెడ్డి హాజరు కావడంతో వైకాపా ప్రధాన నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున డీఎస్పీ కార్యాలయం వద్దకు చేరుకుని విచారణ కొనసాగింతవరకు కార్యాలయం వద్ద వేచి ఉన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు మళ్లీ రెండు గంటల నుంచి సాయంత్రం 6:30 గంట వరకు విచారణ సాగింది.

### బి కొత్తకోట కేసులో 27 నా విచారణకు నోటీసులు జారి..

అన్నమయ్య జిల్లా బి కొత్తకోట పోలీస్ స్టేషన్ నందు సోషల్ మీడియా కేసులో చాకల రాజా ఇచ్చిన ఫిర్యాదు మేరకు క్రైమ్ నెంబర్ 189/24 కేసులో సజ్జల భార్గవ్ రెడ్డి పై ఎటు ముద్దాయిగా కేసు నమోదు కాగా ఈ కేసులో ఈ నెల 27 వ తేదీన విచారణకు హాజరుకావాలని బి కొత్తకోట సిఐ గోపాల్ రెడ్డి సజ్జల భార్గవ్ రెడ్డికి 41 నోటీసులు జారీ చేశారు. దీనితో సజ్జల భార్గవ్ ను మరిన్ని రోజులు పోలీసులు విచారణ చేపట్టే అవకాశం కనిపిస్తోంది.



డీఎస్పీ కార్యాలయం వద్ద విచారణకి హాజరై భార్గవ్



# మలేరియా వ్యాధిపై ప్రజలకు సలహాలు సూచనలు

ఒంటిమిట్ట ఏప్రిల్ 25. ప్రభాతవార్త

ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మండల కేంద్రమైన ఒంటిమిట్టలో ఉన్న ప్రభుత్వ వైద్యశాలలో మెడికల్ డాక్టర్ భావన, అదనపు డాక్టర్ అరుణ జ్యోతి ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది మలేరియా వ్యాధి నిర్మూలన పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తూ సలహాలు సూచనలు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా మెడికల్ డాక్టర్ భావన మాట్లాడుతూ మలేరియా వ్యాధి పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎవరికైనా జ్వరం వచ్చినట్లయితే వైద్యశాలకు వచ్చి రక్త పరీక్షలు చేయించుకోవాలని మలేరియా అని నిర్ధారణ అయితే నయమయ్యేందుకు వైద్యం చేయించుకోవాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పరిసరాల శుభ్రతపై సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. వైద్యశాల అదనపు డాక్టర్ అరుణ జ్యోతి మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత పరిసరాల పరిశుభ్రత అత్యంత ప్రధానమన్నారు. దోమల వల్ల వ్యాధులు వస్తాయని మలేరియా, ప్రాణాంతకమైన వ్యాధులు నిర్మూలించాలంటే పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని నిద్రించేటప్పుడు దోమతెరలు వాడాలని మురికి కాలువల వద్ద నీరు నిల్వ ఉన్న ప్రదేశాలలో ఎప్పటికప్పుడు క్రిమిసంహారక మందులు ఉపయోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఈఓ రాధాకృష్ణారెడ్డి, పీహెచ్ఎన్ వెంకట సుబ్బమ్మ, సూపర్వైజర్ భాస్కర్ రెడ్డి, స్టాఫ్ నర్స్ శ్రావణి, ఫార్మాసిస్టు అరుణ కుమారి, ల్యాబ్ టెక్నీషియన్ వెంకట్ రాజ్ కుమార్, ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.



# మలేరియ దినోత్సవం సందర్భంగా ర్యాలీ

సుండుపల్లె, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:

మండలపరిధిలోని రాయవరం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం లోని మడితాడు నందు ప్రపంచ మలేరియా దినోత్సవ ర్యాలీ మరియు అవగాహన డాక్టర్ రూబీనా మరియు సుండుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు డాక్టర్ పర్వా ఖానం, డాక్టర్ దిలీప్‌లు 25వ తేదిన నిర్వహించడం జరిగింది, ఈ సందర్భంగా వారు మాట్లడుతూ దోమలు అభివృద్ధి చెందకుండా అరికట్టాలనియు, ప్రతి శుక్రవారం డ్రై డే ఫ్రై డే పాటించి ఇంట్లో బయట నీరు నిల్వ ఉంచ కుండా వారానికి ఒక సారి తప్పకుండా శుభ్రం చేసుకోవాలని డ్రమ్ములు, పాత టైర్లు లేకుండా చూసుకోవాలని తెలియజేసారు. ప్రతి సంవత్సరం ఏప్రిల్ 25 తేదీన మలేరియా దినోత్సవం జరుపుకొంటాం 100 సంవత్సరాల క్రితం రాబర్ట్ కాక్ మలేరియా వ్యాధి దోమల ద్వారా వస్తుందని కనుగొన్నాడనియు, అనాఫిలాస్ దోమ కాటు ద్వారా మలేరియా వస్తుందని ఈ దోమ మురికి నీటి లో ఉంటుందని చలి, జ్వరం, కీళ్ళ నొప్పులు ఉంటాయని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ రామకృష్ణయాదవ్, సూపర్ వైజరు సదాశివారెడ్డి, మాధవిలత, రామయ్య, ఎఎన్ఎంలు, ఆశాలు, ఎంపీహెచ్ఇఒ వీర నారాయణ, హెల్త్ ఎద్యుకేటర్ సుగుణమ్మ, ల్యాబ్ టెక్నీషియన్ శీను నాయక్, హెచ్ ఒ లు, ఎ ఎన్ ఏంలు, అశాలు పాల్గొన్నారు.



## మలేరియాను లేకుండా చేయడమే లక్ష్యం



తొండూరు ఏప్రిల్25 ప్రభాతవార్త:

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తొండూరు యందు డాక్టర్ సుభాషిణి ఆధ్వర్యంలో ప్రపంచ మలేరియా డే నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశం నందు డాక్టర్ గవాస్కర్ రెడ్డి మాట్లాడుతూ 2030 నాటికి భారతదేశం నుండి మలేరియా వ్యాధి లేకుండా చేయాలని ప్రభుత్వం అందించిన లక్ష్యంతో పనిచేయాలని మన మండలం మలేరియా లేకుండా, ప్రతి ఆశా కార్యకర్త తన గ్రామం లో మలేరియా వ్యాధి రాకుండా వ్యాధి త్వరిత గుర్తింపు, నివారణ, చికిత్స అందించాలని " మలేరియా నిర్మూలనదిశగా, ఇప్పుడు మనం సాధించగలం, ఇప్పుడు తప్పక సాధించాలి అనే థీమ్ ద్వారా సిబ్బంది అవగాహన కలిగించి మలేరియా అవగాహన కార్యక్రమాలు ప్రతి గ్రామము లో విరివిగా చేపట్టాలని తెలిపారు. తర్వాత సిబ్బందితో చిన్న దోమ పెద్ద ప్రమాదం. దోమ పుట్టరాదు !! దోమ కుట్టరాదు. పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత. లాంటి నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నహీదా, కమ్యూనిటీ ఆరోగ్య అధికారిని విజయ, డిప్యూటీ ఆరోగ్య ఎద్యుకేషన్ అధికారి మల్లయ్య, ఆరోగ్య కార్యకర్తలు మరియు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇంటర్ సప్లిమెంటరీ
# ఫీజుల చెల్లింపుకు చివరి గడువు

ఎడ్యుకేషన్, ఏప్రిల్ 25 ప్రభాతవార్త :

ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల ఫీజుల చెల్లింపుకు సోమవారం (ఏప్రిల్ 27, 2026) చివరి తేదీగా నిర్ణయించబడినట్లు ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి టి.ఎన్.వి. వెంకటేశ్వర్లు తెలిపారు. ఇదే గడువు లోపల రీకౌంటింగ్, రీ వెరిఫికేషన్ కోసం కూడా దరఖాస్తులు స్వీకరించబడతాయని వెల్లడించారు. ఇకపై గడువు పొడిగింపు ఉండదని స్పష్టం చేసిన అధికారులు, విద్యార్థులు ఈ అవకాశాన్ని తప్పకుండా వినియోగించుకోవాలని సూచించారు. ఆలస్యం చేసిన వారికి ఎటువంటి అవకాశం ఇవ్వబడదని హెచ్చరించారు. అదేవిధంగా, కొంతమంది కళాశాలలు పరీక్ష ఫీజుల పేరుతో అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు సమాచారం అందిన నేపథ్యంలో, అలాంటి చర్యలను కఠినంగా నిరోధిస్తామని అధికారులు హెచ్చరించారు. బోర్డు నిర్ణయించిన ఫీజులు మాత్రమే వసూలు చేయాలని స్పష్టం చేశారు. ఎవరైనా కళాశాల యాజమాన్యాలు అధిక ఫీజులు వసూలు చేసినట్లయితే, బోర్డు నిబంధనల మేరకు కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

## వేసవి సెలవుల్లో
# విద్యార్థుల భద్రతపై కీలక సూచనలు

ఎడ్యుకేషన్ ఏప్రిల్ 25 ప్రభాతవార్త :

వేసవి సెలవులు ప్రారంభమవుతున్న నేపథ్యంలో విద్యార్థుల భద్రతపై విద్యాశాఖ కీలక సూచనలు జారీ చేసింది. ముఖ్యంగా పెరుగుతున్న ఎండల తీవ్రత, ప్రమాదకర పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పిల్లలు జాగ్రత్తగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. విద్యార్థులు సెలవుల సమయంలో కాలువలు, చెరువులు, బావులు వంటి ప్రమాదకర ప్రాంతాలకు వెళ్లకుండా తల్లిదండ్రులు పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఈత రాని విద్యార్థులు నీటి వనరులకు దూరంగా ఉండాలని, ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశాలు ఉన్నాయని స్పష్టం చేశారు. ఎండ తీవ్రత రోజురోజుకు పెరుగుతున్నందున విద్యార్థులు మధ్యాహ్న సమయంలో బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. అవసరమైతే తగినంత నీరు తాగడం, తేలికపాటి దుస్తులు ధరించడం, వేడి గాలులకు గురికాకుండా ఉండడం వంటి జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉంది. అలాగే విద్యార్థులు ఒంటరిగా బయటకు వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా చిన్నపిల్లలు ఎప్పుడూ పెద్దల పర్యవేక్షణలోనే ఉండేలా చూడాలి. సెలవుల సమయంలో ఆటపాటలతో పాటు విద్యార్థుల అభ్యాసం కూడా కొనసాగాలని ఉపాధ్యాయులు సూచించారు.

## శాంతియుతంగా సాగిన పాలిసెట్ పరీక్షలు

- అధికారులు సంతృప్తి

ప్రొద్దుటూరు క్రైం, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:



ఏపీ రాష్ట్ర సాంకేతిక విద్యా మరియు శిక్షణ మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన పాలీసెట్–2026 ప్రవేశ పరీక్షలు ప్రొద్దుటూరు పట్టణంలోని 7వ పరీక్షా కేంద్రంలో శాంతియుత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించినట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ పాలెం గురుమూర్తిరెడ్డి మీడియాకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ప్రొద్దుటూరు కేంద్ర పరిధిలోని మొత్తం 7 పరీక్షా కేంద్రాల్లో కలిపి 2666 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 1562 మంది అబ్బాయిలు, 1104 మంది అమ్మాయిలు ఉన్నారు. వీరిలో 2517 మంది పరీక్షకు హాజరయ్యారన్నారు. పరీక్షల ఎనిర్వహణకు ముందస్తుగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నామని ప్రిన్సిపల్ తెలిఏపారు. పరీక్షలు సజావుగా జరిగేందుకు సహకరించిన ఉపాధ్యాయులు, సిబ్బంది, పోలీసు శాఖ అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రభుత్వ భూములను కాజేసేందుకు టిడిపి పావులు

ప్రొద్దుటూరు ఏప్రిల్ 25 ప్రభాతవార్త

ప్రొద్దుటూరు పట్టణ శివారులోని ప్రభుత్వ భూములు కాజేసేందుకు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, కొండారెడ్డి ప్రయత్నం చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి ఆరోపించారు. శనివారం తన నివాసంలో మాట్లాడుతూ పట్టణంలోని ఒకటవ వార్డు బొల్లవరంలో దేవదేవుడు శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారి ఆలయానికి సమీపంలో వున్న ప్రభుత్వ స్థలాన్ని ఎమ్మెల్యే ఆయన కుమారుడు కాజేసే యత్నం చేస్తున్నారని, ఇందుకోసం వారు అక్రమ మార్గంలో ఇప్పటికే అన్ని రకాల చర్యలు తీసుకున్నారని తెలియజేశారు. గతంలో బొల్లవరం ప్రాంతానికి చెందినకి చెందిన ఈ భూమి దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ ల్యాండ్ సీలింగ్ యాక్ట్ కారణంగా 1970లో ఆయన కున్న 42 ఎకరాలలో ఈ ఎకరాల 68 సెంట్ల భూమి ప్రభుత్వానికి చెందిందని, దాని బొల్లవరం, దొరసానిపల్లె, చౌటపల్లె, తదితర ప్రాంతాలకు చెందిన తొమ్మిది మంది రైతులకు వ్యవసాయం చేసుకునే నిమిత్తం తాత్కాలిక డికేటీ క్రింద అందజేసి, సంవత్సరానికి దాదాపు 490 రూపాయలు పన్ను చెల్లించేలా, నిబంధనలు అతిక్రమిస్తే రద్దు చేసేలా నిబంధనలు రూపొందించారని, కానీ వారు వ్యవసాయం చేయక పోగా సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో లేని కారణంగా రామేశ్వరానికి చెందిన వ్యక్తులకు విక్రయించి రిజిస్ట్రేషన్ చేయించారని వివరించారు. కాగా పట్టణ ప్రజలు కలెక్టర్‌కు విషయం తెలపగా ఆయన విచారణకు ఆదేశించగా, విచారణలో అది వాస్తవమేనని తేలడంతో విచరణాధికారి నివేదిక సమర్పించారని తెలిపారు. కాగా తర్వాత తాత్కాలిక డికేటీ పొందిన వారే కోర్టును ఆశ్రయించి శాశ్వత డికేటీ కావాలని కోరగా, కోర్టు కలెక్టర్ వివరణ, నిబంధనల ఉల్లంఘన, అందుబాటులో వున్న జీవోల ప్రకారం డికేటీ ఇవ్వమని తీర్పు ఇచ్చారని వివరించారు. కాగా ప్రస్తుతం ప్రొద్దుటూరు ఎమ్మెల్యే, ఆయన కుమారుడు దొరసానిపల్లెకు చెందిన నాయకులతో కలిసి అక్రమ మార్గంలో ఈ భూమిని కాజేసేందుకు పథకం ఆలోచించి, డబ్బు సమకూర్చుకొని, ఎమ్మెల్యే బందువైన న్యాయవాది ద్వారా వివరాలు సేకరించి ఆ భూమిని కాజేసేందుకు కుట్ర పన్నారని వివరించారు. కావున అధికారులు వారి చర్యను అడ్డుకొని ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరారు. అలా కాకుండా అధికారులు అధికార పార్టీ నాయకులకు సహకరిస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. తన ఆరోపణలు అవాస్తవమేతే ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి, ఆయన కుమారుడు కొండారెడ్డి ప్రత్యక్షంగా ప్రమాణ పూర్వకంగా తెలపాలని సవాల్ విసిరారు. ఈ భూమి అన్యాక్రాంతాన్ని అడ్డుకునేందుకు తాను గాంధేయ మార్గంలో పోరాడతానని స్పష్టం చేశారు.



## దోమల నివారణపై వైద్యాధికారుల ర్యాలీ



నందలూరు, ఏప్రిల్ 25 ప్రభాతవార్త:

దోమల వల్ల వ్యాపించే మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులను అరికట్టేందుకు ప్రజల్లో అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందని ప్రభుత్వ వైద్యాధికారి కార్తీక్ విశ్వనాథ్ పేర్కొన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి బస్టాండ్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మురికి నీటి నిల్వలు దోమల పెరుగుదలకు ప్రధాన కారణమని, ఇంటి పరిసరాల్లో ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం 'డ్రై డే' పాటించడం, నీటి తొట్టెలపై మూతలు పెట్టడం, దోమ తెరలు వినియోగించడం వంటి చర్యలు తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. పరిసరాల పరిశుభ్రతను కాపాడడం ద్వారా దోమల సమస్యను గణనీయంగా తగ్గించవచ్చన్నారు. కార్యక్రమంలో సి.హెచ్.ఓ. వెంకట నారాయణ, సూపర్వైజర్ సునీల్, హెల్త్ అసిస్టెంట్ మధు, ఎం.ఎల్.హెచ్.పీ ఆరిఫ్, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రభాకర్ రెడ్డికి క్రియాశీల పదవి

రాజుపాళెం, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:

మాజీ ఎంపీపీ మెట్టుపల్లె ప్రభాకర్ రెడ్డికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ గా పదవి వరించినది. ఆయన గతంలో రాజుపాలెం మండలం ఎంపీపీగా పని చేసిన అనుభవం ఉన్నది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తనపై నమ్మకంతో నాకు అప్పగించిన ఈ బాధ్యతలను సక్రమంగా నిర్వహించి పార్టీ కోసం బాధ్యతాయుతంగా పని చేస్తానని అన్నారు. శనివారం మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డిని ప్రభాకర్ రెడ్డి తన అనుచరులతో కలిసి పుష్ప గుచ్ఛమును అందించి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీలో బాధ్యతాయుతమైన స్థానం కల్పించిన పార్టీ పెద్దలు వైయస్ జగన్మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ, ఎంతో నమ్మకంతో సముచిత స్థానంకు సిపార్సు చేసిన వైయస్సార్సీపి అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. పార్టీ కోసం తన వంతు అహర్నిశలు కృషి చేయడంతో పాటు అయన వెంట ముందుండి ప్రజా సమస్యలపై స్పందిస్తూ, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ పార్టీ కోసం పని చేస్తానని తెలిపారు. ప్రభాకర్ రెడ్డికి పార్టీ గుర్తింపు నిచ్చి బాధ్యతాయుతమైన పదవి లభించినందుకు పలువురు నాయకులు, అభిమానులు హర్షం వ్యక్తం చేశారు.



## భారత జనగణన 2027 అవగాహనపై 2కె రన్

మైదుకూరు, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:

భారత జనగణన – 2027 కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు 2Ꮶ రన్ కార్యక్రమం ఆదివారం ఉదయం 7:00 నుండి 9:00 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు మైదుకూరు మున్సిపాలిటీ కమిషన్ రంగస్వామి, మండల తహసిల్దార్ రాజసింహ నరేంద్ర తెలిపారు. ఈ కార్యక్రమం కడప రోడ్డు లోని ఎంపిడిఓ ఆఫీస్ ఆవరణ నుండి ప్రొద్దటూరు రోడ్ లోని పాత మునిసిపల్ ఆఫీస్ మరియు రాయల్ సర్కిల్ వరకు నిర్వహిస్తారని ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అన్ని డిపార్ట్మెంట్ల అధికారులు, ప్రభుత్వ ప్రైవేటు విద్యాసంస్థల అధినేతలు, జనగణన ఎన్యూమరేటర్‌లు, సూపర్వైజర్లు, మీడియా మిత్రులు, మేధావులు, స్వయం సహాయక సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు మరియు విద్యార్థులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## నిరాధారమైన వార్తలు ప్రసారం
# చేసినందుకే ఎస్పీకి ఫిర్యాదు చేశాం

మాజీ సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి

ప్రొద్దుటూరు ఏప్రిల్ 25 ప్రభాతవార్త



తమపై నిరాధారమైన ఆరోపణలతో కూడిన వీడియోలను ప్రసారం చేశారనే యూట్యూబర్‌పై చట్ట పరిధి మేరకు ఎస్పీకి ఫిర్యాదు చేశామే తప్ప ఎలాంటి బెదిరింపులకు గురి చేయలేదని కొత్తపల్లె మాజీ సర్పంచి కొనిరెడ్డి శివచంద్రారెడ్డి తెలిపారు. శనివారం తన ఆయిల్ మిల్లులో మాట్లాడుతూ యూట్యూబర్ పై తప్పుడు కేసులు బనాయించి బెదిరిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే రాచమల్లు చేసిన ఆరోపణలపై ఆయన ఘాటుగా స్పందించారు. నియోజకవర్గంలోని విలేకరులను బెదిరించి దుర్భాషలాడే చరిత్ర రాచమల్లుదేనని, కొన్నేళ్లుగా విలేకరులను మిత్రులుగానే చూస్తామని ఏనాడు వారిని బెదిరించింది లేదన్నారు. ఇప్పుడు కూడా యూట్యూబర్ తమపై నిరాధారమైన ఆరోపణలతో వీడియోలు ప్రసారం చేయడంతోనే కట్ట పరిధి మేరకు జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశామే తప్ప ఎలాంటి బెదిరింపులకు గురి చేయలేదని వివరించారు. గతంలో అదే యూట్యూబర్‌ను మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డ బెదిరిస్తే తానే ధైర్యం చెప్పానని, అదేవిధంగా అతన్ని వారు ఏదైనా చేసి ఆ నెపం నాపైన నెడతారనే ఉద్దేశ్యంతోనే తాను ఎస్పీ ని కలిశానని వివరించారు.

ఒక బాధితురాలు తన ఆవేదనను తెలిపితే ఒక యూట్యూబ్ ఛానల్ లో ప్రసారం చేసినందుకు ఆ యూట్యూబర్ పై కొత్తపల్లి మాజీ సర్పంచి కొనిరెడ్డి శివచంద్రారెడ్డి అక్రమంగా కేసు బనాయించడం సరి కాదన్నారు. పోలీసులు ఇటువంటి చర్యలకు సహకరించరాదని సూచించారు. జర్నలిస్టులపై బెదిరింపులు, తప్పుడు కేసులు భావ్యం కాదని తెలిపారు. గత వైసీపీ పాలనలో విలేకరుల పై ఎలాంటి కేసులు నమోదు చేయలేదని కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుండి విలేకరులపై తప్పుడు కేసులు బనాయిస్తున్నారని విమర్శించారు. తప్పుడు కేసులకు గురైన విలేకరుల కోసం పోరాటం చేస్తామని తెలిపారు.

## దాడి కేసులో ముగ్గురు అరెస్ట్

ముగ్గురి కోసం గాలింపు:

ఒంటిమిట్ట ఏప్రిల్ 25 ప్రభాతవార్త

ఒంటిమిట్ట హోటల్లో బాధ్యతలు నిర్వహిస్తున్న హర్షవర్ధన్ను 18వ తేదీ హోటల్ పక్కన కొందరు వ్యక్తులు గాయపరచడం జరిగింది. ఈ సంఘటనపై జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు శనివారం ఒంటిమిట్ట పోలీస్ కార్యాలయంలో రాజంపేట ఏఎస్పి మనోజ్ పాత్రికేయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ శనివారం స్థానిక ఒంటిమిట్ట సాలాబాద్ క్రాస్ వద్ద ముగ్గురు ముద్దాయిలను అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు. మిగిలిన ముగ్గురు ముద్దాయిల కోసం గాలిస్తున్నట్లు తెలియజేశారు. బాధితుడు అందించిన వాంగ్మూలం ప్రకారం 6 మంది పైన కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. కట్ట. మల్లికార్జున, పూల. కిరణ్ కుమార్, కట్ట .బాల కృష్ణ ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు. మిగిలిన ముగ్గురు ముద్దాయిల కోసం ముమ్మరంగా గాలిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఈ ఆపరేషన్లో ప్రత్యేక ప్రతిభ కనబరిచిన ఒంటిమిట్ట సర్కిల్ ఇన్స్పెక్టర్, సబ్ ఇన్స్పెక్టర్లు పోలీసు సిబ్బందిని ప్రత్యేకంగా ఆయన అభినందించడం జరిగింది.

## స్వయంభు శ్రీలక్ష్మీనరసింహస్వామి పూజ

గోపవరం. ఏప్రిల్ 25. ప్రభాతవార్త.



గోపవరం మండలం వల్లేరవారి పల్లె గ్రామంలో వెలసిన స్వయంభు శ్రీ లక్ష్మీనరసింహస్వామికి వైశాఖ మాసం రెండవ శనివారం సందర్భంగా పూజాభిషేకాలను అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగింది, స్వామివారికి ప్రత్యేక అలంకరణ కార్యక్రమాన్ని చేశారు, లక్ష్మి నరసింహ స్వామి ఉపాశకులు పెంచలయ్య స్వామి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది, ప్రత్యేక అలంకరణలో ఉన్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని భక్తులు కన్నుల పండుగ దర్శించుకున్నారు, ఆలయ నిర్వాహకులు, గ్రామ పెద్దలు, యువకులు మాట్లాడుతూ ఈ నెల లో జరగవలసిన స్వామి బ్రమోత్సవాలను కొన్ని అని వార్య కారణాల వలన వాయిదా వేయ్యటం అయినది మే నెలలో 16 వ తేదీ లోపు స్వామి బ్రమోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వస్తాము అని తెలియజేశారు తదుపరి వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదం అందించారు, శ్రీ లక్ష్మీనరసింహస్వామి కుటుంబ సభ్యులు ఆలయం వద్ద అన్నదాన కైంకర్యం నిర్వహించడం జరిగింది, ఈ కార్యక్రమంలో వీహెచ్పీ నాయకులు పిట్ట వేణు యాదవ్ పలువురు ప్రముఖులు గ్రామ పెద్దలు ప్రజలు పాల్గొన్నారు.



## ఘనంగా కన్యకాపరమేశ్వరి జయంతి

ప్రొద్దుటూరు క్రైం, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:

అమ్మవారివాలలో వెలసిన శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి ఆదివారం నిర్వహించడం జరుగుతుంది. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తాదులకు తీర్థప్రసాదాలు అందించడం జరుగుతుంది. అమ్మవారి జీవిత చరిత్ర.. మహాభాగవతంలో చెప్పినట్లు కంసుడు పైకి ఎగురవేసినప్పుడు ఆకాశీధిలో సాక్షాత్కరించిన యోగమాయ, పరదేవతా స్వరూపమైన అమ్మవారికి దుర్గ, భద్రకాళి, విజయ, వైష్ణవి, కుముద, చండిక, కృష్ణ, మాధవి, కన్యక, మూయ, నారాయణి, ఈశాన, శారద, అంబిక అని 14 పేర్లున్నాయి. అందులో ఉన్న కన్యక అనుపేరు మీద అమ్మవారికి కన్యకాపరమేశ్వరి అనే పేరు వచ్చింది. వైశ్య జాతి(వాసవజాతి)లో జన్మించినది కనుకనే వాసవీ మాత అయినది. భక్తుల పాలిట కల్పతరువుగా పూజలందుకుంటూ తన జన్మదినమైన ప్రతి శుక్రవారం భక్తుల నుంచి పూజలు, అభిషేకాలు అందుకుంటోంది.

# లింగాల వైసీపీ వాస్తవాలు తెలుసుకొని మాట్లాడండి

పులివెందుల, ఏప్రిల్ 25 ప్రభాతవార్త :

లింగాల మండల వైసీపీ నాయకులు వాస్తవాలు తెలుసుకొని మాట్లాడితే మంచిదని లింగాల మండల టిడిపి నాయకులు నవీన్ రెడ్డి, విశ్వనాథరెడ్డి అమర్నాథ్ రెడ్డి, విజయ కుమార్ రెడ్డి తదితరులు అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయం నందు ఏర్పాటుచేసిన మీడియా సమావేశం నందు వారు మాట్లాడుతూ వైసీపీ నాయకులపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. లింగాల మండలం నేతలు రాజకీయ అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. బీటెక్ రవి సొంత నిధులతో అభివృద్ధి పనులకు సహకరిస్తున్న విషయాన్ని వక్రీకరించి ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. మారెడ్డి కుటుంబంపై ఆరోపణలు చేయడం అనవసరమని, ఆ కుటుంబం ఏకతాటిపై నిలబడే సామర్థ్యం కలిగినదని ఆయన పేర్కొన్నారు. అవసరమైతే ఒకే వేదికపై కుటుంబ సభ్యులంతా చేరి ఏ అంశంపైనా మాట్లాడగలరని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా వైఎస్ కుటుంబాన్ని ఉద్దేశించి విజయ్ కుమార్ రెడ్డి పలు ప్రశ్నలు లేవనెత్తారు. కుటుంబ సభ్యులు ఒకే వేదికపై కనిపించలేరా అని ప్రశ్నిస్తూ, కుటుంబ విభేదాలను ప్రజల్లోకి తీసుకురావడం సరికాదన్నారు. కుటుంబ సమస్యలను అంతర్గతంగా పరిష్కరించుకోవాల్సిన బాధ్యత నాయకత్వంపై ఉందని సూచించారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి తన కుటుంబ వ్యవహారాలను సక్రమంగా నిర్వహించలే కపోతున్నారని విమర్శించా రు. సొంత చెల్లెలిపై అనుచిత వ్యాఖ్యలు వస్తున్నప్పటికీ స్పందించకపోవడం విచారకరమని అన్నారు. అలాంటి పరిస్థితిలో తాను ఉంటే తీవ్రంగా స్పందించేవా డినని వ్యాఖ్యానించారు. రాజకీయ ప్రయోజనాల కోసం కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకుని అవమానకర వ్యాఖ్యలు చేయడం తగదని, ఇది ప్రజాస్వామ్యానికి మంచిది కాదని విజయ్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న లింగాల మండల నాయకులు

## సంఘటనా స్థలాన్ని పరిశీలించిన సీఐ

దువ్వూరు, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:

మండల పరిధిలోని దాసరి పల్లె గ్రామంలో మంగళవారం పొలం గట్టు వద్ద జరిగిన ఘర్షణ కేసుకు సంబంధించిన సంఘటనా స్థలాన్ని మైదుకూరు రూరల్ సీఐ శివ శంకర్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఘర్షణకు దారి తీసిన పరిస్థితులు, ఘర్షణ ఎలా జరిగింది అనే విషయాలపై ఆరా తీశారు. అలాగే కర్నూలు నుండి వచ్చిన ఆర్ఎఫ్ఎస్ఎల్ బృందం ఘర్షణ జరిగిన ప్రాంతంలో మట్టి నమూనాలను, రక్తం పడి ఉన్న ప్రదేశాలను పరిశీలించి వాటిని సేకరించారు. ఈ సంఘటనలో శ్రీనివాసులు అనే వ్యక్తి మృతి చెందడంతో కేసు నమోదు చేసి దర్యాప్తులో భాగంగా సంఘటన స్థలాన్ని మైదుకూరు రూరల్ సీఐ అలాగే ఆర్ఎఫ్ఎస్ఎల్ బృందం పరిశీలించింది.

## బీసీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా వరప్రసాద్

బీసీ వర్గాల అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తానని హామీ

పులివెందుల, ఏప్రిల్ 25, ప్రభాత వార్త :



పులివెందులకు చెందిన వైసిపి నాయకులు మాజీ మున్సిపల్ చైర్మన్ వల్లేపు వరప్రసాద్ ను బీసీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షు డిగా నియమించారు. పార్టీ అధిష్టానం తనని ఉపాధ్యక్షుడిగా నియామకమైన వరప్రసాద్ తనపై విశ్వాసం ఉంచిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ బాధ్యతను అప్పగించిన నాయకులు వైయస్ జగన్ మోహన్ రెడ్డి, వైయస్ అవినాష్ రెడ్డి, వైయస్ భాస్కర్ రెడ్డి, వైయస్ మనోహర్ రెడ్డి, వైయస్ మదన్ మోహన్ రెడ్డి, దుష్యంత్ రెడ్డి, దేవిరెడ్డి శంకర్ రెడ్డి, సతీష్ రెడ్డి తదితరులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా కృషి చేస్తానని, ముఖ్యంగాటీ బీసీ వర్గాల అభివృద్ధి, సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తానని పేర్కొన్నారు. పార్టీ ఆశయాలు, సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో తన వంతు పాత్రను సమర్థవంతంగా నిర్వహిస్తానని తెలిపారు. ఇకపై బీసీ వర్గాల హక్కులు, అవకాశాల సాధన కోసం కృషి చేస్తానన్నారు.

## శ్రీ వేంకటేశ్వర స్వామికి విశేష పూజలు





బద్వేల్ అర్బన్ ఏప్రిల్ 25 ప్రభాతవార్త :

బద్వేల్ మున్సిపాలిటీ పరిధి సిద్ధవటం రోడ్ సుమిత్రానగర్ లో వెలిసిన శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి మరియు అభయ అంజనేయ స్వామి దేవాలయంలో శనివారం వీరేశచార్యులు ఆధ్వర్యంలో వేంకటేశ్వర స్వామికి పంచామృత అభిషేకం కుంకుమ అర్చన పలు రకాల విశేష పూజలు నిర్వహించడం జరిగింది, ప్రత్యేక అభిషేక దాతలుగా పబ్బతి చక్ర పాణి సతీమణి శ్రీదేవి కుటుంబ సభ్యులు, మాజీ కౌన్సిలర్ చెవుల వెంకటేశ్వర్లు ధర్మ పత్ని నాగమణి కుటుంబ సభ్యుల పొదిలి శ్రీనివాసులు సతీమణి రాజేశ్వరి కుటుంబ సభ్యులకు స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు, వైశాఖమాసం పురస్కరించుకుని తెల్లవారుజాము నండి భక్తులందరూ ఆలయ ప్రదక్షిణాలు చేపట్టి భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకుని కాయా కర్పూరం సమర్పించుకుని తమ భక్తిని చాటుకున్నారు, ఆలయానికి వచ్చిన భక్తులకు ఆలయ నిర్వహకులు వ్నల్ల కొండు వెంకటరమణ మరియు పలువురు కమిటీ సభ్యులు భక్తులకు ప్రత్యేక తీర్థప్రసాదాలను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కుప్పం సుధాకర్, మాడపూర్ వెంకటరమణ, సిద్దయ్య మరియు పలువు కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

## ఇసుక రీచ్ రద్దు చేయాలని మహా ధర్నా

ఇసుక తవ్వకాల కారణంగా పంట భూములు దెబ్బతింటున్నాయని, తెలిపారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు మాట్లాడుతూ, అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, సంబంధిత అధికారుల నిర్లక్ష్యంపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ప్రజల జీవనాధారమైన వ్యవసాయం, నీటి వనరులను కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సంబంధిత ఇసుక రీచ్‌ను రద్దు చేయాలని, అక్రమ తవ్వకాలపై పూర్తిస్థాయి నిషేధం విధించాలని వారు స్పష్టం చేశారు. లేదంటే రాబోయే రోజుల్లో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు.

## గొర్రెలమందపై కుక్కలు దాడిలో 40 గొర్రెలు మృతి



రామసముద్రం ఏప్రిల్ 25 ప్రభాతవార్త :

అన్నమయ్య జిల్లా మండలం ఊలపాడు గ్రామంలో శుక్రవారం రాత్రి విషాద ఘటన చోటుచేసుకుంది. బుసానికురప్పల్లి గ్రామానికి చెందిన బాతిన్న గారి చంద్రప్పకు చెందిన గొర్రెల షెడ్డుపై కుక్కలు దాడి చేయడంతో 40 గొర్రెలు మృతి చెందాయి. ఈ ఘటనతో ఆయనకు దాదాపు రూ.3.5 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు. గొర్రెలను మేపుకుంటూ జీవనం సాగిస్తున్న చంద్రప్ప ఒక్కసారిగా జరిగిన ఈ ఘటనతో తీవ్ర ఆవేదనకు గురయ్యారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి కుక్కల బెడద నుండి రక్షణ కల్పించాలని, నష్టపరిహారం అందించాలని ఆయన వాపోయారు.

## భారతీయ సాంస్కృతికి మూలాధారం మహాభారతం

### రాజంపేట టీడీపీ పార్లమెంట్ అధ్యక్షులు ప్రసాద్ బాబు



గాలివీడు: ఏప్రిల్ 25. ప్రభాతవార్త.

భారతీయ సాంస్కృతికి మూలాధారం మహాభారతమని రాజంపేట టీడీపీ పార్లమెంట్ అధ్యక్షులు సుగవాసి ప్రసాద్ బాబు పేర్కొన్నారు. శనివారం గాలివీడు మండలంలోని అరవీడు గ్రామం పాతపాలెం సమీపంలో నిర్వహిస్తున్న ద్వితీయ శ్రీ పంచమవేద మహాభారత యజ్ఞం కార్యక్రమాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మహాభారతంను ఉద్దేశించి మాట్లాడుతూ ధర్మం, న్యాయం, నీతి, కుటుంబ విలువలను ప్రతిబింబించే గొప్ప ఇతిహాసం మహాభారతమని అన్నారు. ధర్మం కోసం పోరాడిన పాండవుల ఆదర్శ మార్గం, అధర్మానికి ముగింపు పలికిన కురుక్షేత్ర యుద్ధ సందేశం నేటి సమాజానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు సంప్రదాయాలను కాపాడుతూ భవిష్యత్ తరాలకు అందించడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## 108 వాహనంలో సురక్షిత ప్రసవం



పీలేరు, ఏప్రిల్ 25 ప్రభాతవార్త:

108 అంబులెన్స వాహనంలో సురక్షిత ప్రసవం జరిగింది. వివరాలిలా వున్నాయి. మండలంలోని బోడుమల్లువారిపల్లె పంచాయతీ మొరవవడ్డి పల్లెకు చెందిన ఆదిలక్ష్మమ్మ (19) శనివారం పురిటినొప్పులు రావడంతో 108 అంబులెన్స్ వాహనంకు సమాచారం అందించారు. అయితే మార్గం మధ్యలో పురిటినొప్పులు అధికం కావడంతో ఈఎంటీ అశోక్ డెలివరీ చేశారు. అదిలక్ష్మమ్మ మగబిడ్డకు జన్మనచ్చింది. తల్లిబిడ్డ సురక్షితంగా ఉన్నారు. అనంతరం తల్లిబిడ్డను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో 108 పైలెట్ వెంకటరమణ పాల్గొన్నారు. 108 సిబ్బందికి ఆదిలక్ష్మమ్మ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## చెత్తనుంచి సంపద తయారుచేయడంలో మెలుకువలు పాటించాలి



వర్మికంపోస్టు తయారీ విధానాన్ని తెలుపుతున్న గఫూర్

చౌడేపల్లి, ఏప్రిల్ 25 ప్రభాతవార్త

చెత్త నుంచి సంపద తయారు చేయడంలో మెలుకువలు పాటించాలని డిఎంపిడిఓ ఎస్ఏ.గఫూర్ అన్నారు. శనివారం మండలంలోని పంచాయతీ కేంద్రం పరికిదొనకు సమీపంలోని చెత్తనుంచి సంపద తయారు చేసే కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ప్రతి ఇంటి నుంచి సేకరించుకొని వచ్చే తడి, పొడి చెత్తలను వెంటనే షెడ్లకు చేర్చాలన్నారు. అందులోని తడి చెత్తను వర్మికంపోస్టు సేంద్రియ ఎరువును తయారు చేయాలన్నారు. ఏ విధంగా తయారు చేయాలన్న అంశాలను వారికి చేసి చూపించారు. అనంతరం పారిశుద్ధ్య చర్యలపై పంచాయతీ కార్యదర్శికి అవగాహన కల్పించారు. పిడిఓ, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

## పేకాటపై పోలీసుల మెరుపుదాడి

ములకలచెరువు, ఏప్రిల్ 25, ప్రభాతవార్త

మండలంలో పేకాట ఆడుతున్న వారిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ములకలచెరువు ఎస్ఐ ఉమామహేశ్వర్ రెడ్డి తెలిపారు. ఎస్సై కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ములకలచెరువు మండలంలోని కదిరినాథునికోట సమీపంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో తమ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించమన్నారు. ఈ దాడిలో మొత్తం ఆరుగురు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు గుర్తించాలన్నారు. పోలీసులు అక్కడికి చేరుకునే సరికి ఇద్దరు వ్యక్తులు పరారయ్యారన్నారు. నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద నుండి 4 మొబైల్ ఫోన్లు, రూ.4,200 నగదు, 2 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న ఇద్దరు వ్యక్తులను పట్టుకునేందుకు గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

## కోసువారిపల్లిలో ప్రపంచ మలేరియా దినోత్సవ ర్యాలీ



తంబళ్లపల్లె ఏప్రిల్ 25 ప్రభాతవార్త ః

తంబళ్లపల్లె మండలం కోసువారిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ షణ్ముఖ ఆధ్వర్యంలో ప్రపంచ మలేరియా దినోత్సవం ర్యాలీ జరిగింది. శనివారం మలేరియా నివారణ పై కోసువారిపల్లి పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ షణ్ముఖ మాట్లాడుతూ మలేరియా దోమ ప్రబలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నివారణకు పారిశుధ్యం పై దృష్టి సారించి ముందస్తు చర్యలు చేపట్టాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ ఆదిలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ కృష్ణా నాయక్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## టోల్ ప్లాజా సిబ్బంది పై టిడిపి ఎమ్మెల్యే అనుచరులు దౌర్జన్యం

### వైసిపి రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి హరి



పీలేరు, వాల్మీకిపురం ఏప్రిల్ 25 ప్రభాతవార్త:

నియోజకవర్గంలోని వాల్మీకిపురం మండలంలోని టోల్ ప్లాజా వద్ద టోల్ గేట్ అడిగినందుకు సిబ్బందిపై దాడి చేసి దారుణంగా కొట్టడం జరిగింది మహిళలను కూడా చూడకుండా మహిళను జుట్టు పట్టుకొని ఈడ్చి ఈడ్చి కొట్టడం జరిగింది .అలాగే సిబ్బందిపై దాడి చేసి ఎమ్మెల్యే అనుచరులు అక్కడున్న టోల్గేట్ కొయ్యని తీసుకొని సిబ్బందిపై దాడికి దిగినారు .రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలో మహిళల పైన దౌర్జన్యాలు మితిమీరి పోతున్నాయి. ఇలాగే దాడులు కొనసాగిస్తే రాబోవు కాలంలో కూటమి ప్రభుత్వానికి చంద్రబాబు నాయుడుకు తగిన బుద్ధి చెప్తారని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి వడ్డే హరి అన్నారు. టోల్గేట్ అడిగినందుకు ప్రజా నాయకుడు ఎమ్మెల్యేగా పనిచేస్తున్న కళ్యాణదుర్గం ఎమ్మెల్యే ఇలాంటి దౌర్జన్యాలు చేయడం చాలా దారుణమని దీన్ని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరపున తీవ్రంగా ఖండిస్తున్నాము .చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలో దళితుల పైన దాడులు మహిళలపై దాడుల తప్ప మరొకటి జరగడంలేదని అన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని సూపర్ సిక్స్ పథకాల ద్వారా అధికారంలోకి వచ్చి పేద ప్రజలకు ఈ పథకాల ద్వారా లబ్ధి చేకూరుస్తానని ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలను అభివృద్ధి పథంలో నడిపిస్తానని చెప్పిన చంద్రబాబు నాయుడు ఇప్పుడు అధికారం వచ్చినప్పుడు నుండి ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీల పైన దాడులు తప్ప అభివృద్ధి జరగకపోగా దాడులు మాత్రం ఘనంగా జరుగుతున్నాయని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున వైసీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి హరి తెలిపారు. ఇలాంటి దాడులు కొనసాగిస్తే రాష్ట్రంలో ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలు చంద్రబాబు నాయుడు ప్రభుత్వాన్ని గంగలో కలపతారని తెలియజేస్తున్నాను.

## భూకబ్జాలపై న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్ విన్నపం



కలెక్టర్ కు విన్నవిస్తున్న దృశ్యం

మదనపల్లి ఏప్రిల్ 25 ప్రభాతవార్త :

మదనపల్లి పట్టణ శివారులోని కొత్త ఇండ్లు గ్రామంలో సర్వే నెం. 307లో ఉన్న తమ భూమిని అక్రమంగా కబ్జా చేసేందుకు పొంతల చంద్రకళ ప్రయత్నిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ కు భూయజమానులు విన్నవించుకున్నారు. శనివారం మదనపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద భూ యజమానులు పిఏ సికిందర్, సనావుల్లా ఖాన్, షానవాజ్ ఖాన్ తదితరులు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మైనార్టీ నాయకులు ఎస్ఏ మస్తాన్‌తో కలిసి కలెక్టర్‌కు తమ వద్ద ఉన్న భూ పత్రాలను చూపించారు. అన్ని రికార్డులు సక్రంగా ఉన్న చంద్రకళ అనే మహిళ తప్పుడు పత్రాలతో తమ భూములకి అక్రమంగా ప్రవేశిస్తున్నట్లు విన్నవించుకున్నారు. ఆమెతో తమకు ప్రాణహాని ఉందని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం ముందు వారు విలేకరులకు అన్ని విషయాలు తెలియజేశారు. చంద్రకళ నుండి తమకు న్యాయం చేయాలని కోరుకున్నారు. వారు మాట్లాడుతూ గతంలో ఇచ్చిన వినతిపత్రానికి అదనంగా మరిన్ని సంచలన నిజాలను కలెక్టర్‌కు చూపించామని చెప్పారు. చంద్రకళ అనే మహిళ రెవెన్యూ శాఖలో తప్పుడు పత్రాలను సృష్టించి, ఇప్పటికే రిజిస్ట్రేషన్ అయిన తమ భూములను స్వాధీనం చేసుకోవాలని చూస్తోందని ఆరోపించారు. రాజకీయ పలుకుబడిని అడ్డం పెట్టుకుని, ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ నాయకురాలిగా చలామణి అవుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతోందని పేర్కొన్నారు. తమ భూములోకి కొంతమంది రౌడీలను పిలిపించుకొని, దౌర్జన్యంగా అక్కడున్న ఆస్తులను ధ్వంసం చేసిందన్నారు. సుమారు రూ.10 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు పేర్కొన్నారు. నిందితురాలు చంద్రకళపై ఇప్పటికే మదనపల్లి తాలూకా పోలీస్ స్టేషన్‌లో ఎఫ్.ఐ.ఆర్ నెం. 340/2025 (డిసెంబర్ 31, 2025), ఎఫ్.ఐ.ఆర్ నెం. 11/2026 (జనవరి 9, 2026) నమోదైనట్లు బాధితులు తెలిపారు. నిందితురాలికి సర్వే నెం. 307బిలో స్థలం ఉండగా, ప్రభుత్వ సర్వేయర్ సుబ్రహ్మణ్యం బాధితులకు చెందిన సర్వే నెం. 307లో ముందస్తు సమాచారం లేకుండా తప్పుడు సర్వే చేశారని ఆరోపించారు. ముఖ్యంగా తప్పుడు సర్వే చేసి, చంద్రకళకు సహకరించిన సర్వేయర్ సుబ్రమణ్యం విధులు నుండి తొలగించాలని ఎస్. ఏ మస్తాన్ డిమాండ్ చేశారు. సర్వేయర్, మండల తహసీల్దార్ అండ చూసుకొని పొంతల చంద్రకళ, వారి అనుచరులు కలిసి తమను చంపేస్తామని బహిరంగంగా బెదిరిస్తున్నారని కలెక్టర్ దృష్టికి తెచ్చామని బాధితులు తెలియజేశారు. కోర్టు స్టే ఆర్డర్లు ఉన్నప్పటికీ, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న అధికారులు, భూకబ్జాదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధితులు కోరారు. తమ భూమికి సంబంధించిన రికార్డులను పరిశీలించి, తమకు ప్రాణ రక్షణ కల్పించాలని పీఏ సికిందర్, సానావుల్లా ఖాన్, షానవాజ్ ఖాన్ తదితరులు విజ్ఞప్తి చేశారు.

## ప్రజలను కాపాడాల్సిన ప్రజాప్రతినిధులే దాడి చేయడం హేయనీయం

### పులి సత్యనారాయణ రెడ్డి



పీలేరు, ఏప్రిల్ 26 ప్రభాతవార్త:

నియోజకవర్గంలోని వాల్మీకిపురం మండలంలోని గండబోయినపల్లె టోల్ గేట్ వద్ద శనివారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. తెలుగుదేశం పార్టీకి చెందిన కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తన అనుచరులతో కలిసి టోల్ గేట్ సిబ్బందిపై దాడికి పాల్పడినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సాక్షుల కథనం ప్రకారం, ఎమ్మెల్యే వాహనం టోల్ గేట్ వద్ద ఆపడంతో ఉద్రిక్తత మొదలైంది. "అధికారంలో ఉన్న ఎమ్మెల్యే బండిని ఆపుతారా?" అంటూ ఆగ్రహం వ్యక్తం చేసిన ఆయన అనుచరులు టోల్ సిబ్బందిపై దాడి చేశారు. ఈ ఘటనలో మహిళా సిబ్బంది శ్రీలతను కూడా వదలకుండా జుట్టు పట్టుకుని దాడి చేయడం తీవ్ర ఆందోళనకు గురిచేసింది. అదేవిధంగా, టోల్ గేట్ మేనేజర్ రవిని కూడా కొట్టి, బలవంతంగా కారులో ఎక్కించుకుని తీసుకెళ్లినట్లు సమాచారం. ఈ సంఘటన స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ప్రజాప్రతినిధుల ప్రవర్తనపై ప్రశ్నలు లేవనెత్తుతూ సామాజిక వర్గాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఈ ఘటనపై గండబోయినపల్లెకు చెందిన సామాజికవేత్త, శ్రీ సత్తెమ్మ తల్లి ఆలయ ధర్మకర్త, రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షులు పులి సత్యనారాయణ రెడ్డి తీవ్రంగా స్పందించారు. ఆయన మాట్లాడుతూ, పీలేరు నియోజకవర్గానికి చెందిన తెలుగుదేశం పార్టీ క్రమశిక్షణకు ప్రతీకగా నిలుస్తుందని, అక్కడి ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి ఎప్పుడూ ఇలాంటి దౌర్జన్యాలను ప్రోత్సహించ లేదని పేర్కొన్నారు. అయితే, మరో నియోజకవర్గానికి చెందిన ఎమ్మెల్యే వచ్చి తమ ప్రాంతంలో ఇలాంటి ఘటనలకు పాల్పడడం తనను తీవ్రంగా కలచివేసిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలను రక్షించాల్సిన ప్రజాప్రతినిధులే ప్రజలపై, ముఖ్యంగా ప్రభుత్వ సిబ్బందిపై దాడి చేయడం అత్యంత హేయమైన చర్య అని ఆయన ఖండించారు. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు, ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

## వెలుగు స్కూల్లో సేవలు అభినందనీయం : డిఎస్పి పావని



ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్న డి.ఎస్.పి

మదనపల్లి ఏప్రిల్ 25 ప్రభాతవార్త :

మదనపల్లి మండలం, అమ్మ చెరువు మిట్ట నందు గల వెలుగు సంస్థలో చేస్తున్న సేవలు అభినందనీయమని మదనపల్లి డిఎస్పి పావని కొనియాడారు. శనివారం డిఎస్పి వెలుగు స్కూల్‌ను సందర్శించారు. వెలుగు సంస్థ 29వ వార్షికోత్సవ వేడుకలు ఎంతో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్ర మానికి ముఖ్యఅతిధులుగా మదనపల్లి డీఎస్పీ పావని హాజరయ్యారు. విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు మరియు వయో వృద్ధుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీ కృష్ణ కిశోర్, బ్రిలియంట్ స్కూల్ కరెస్పాండెంట్ యం . సహదేవ్ రెడ్డి , వెలుగు ప్రెసిడెంట్ ఎన్.వి. రమణరావు, వెలుగు ఓల్డ్ ఏజ్ హోమ్ సూపరింటెండెంట్ ఉదయ్ కుమార్ రెడ్డి, ట్రెజరర్ రఘు నాథ్ రెడ్డి, వెలుగు సెక్రటరీ ఎం ఉదయ్ మోహన్ రెడ్డి వేదికను అలంక రించగా. చిన్నారులు అతిధులను పుష్ప గుచ్ఛాలతో స్వాగతం పలికారు. వెలుగు సంస్థ వ్యవస్థాపకురాలు స్వర్గీయ పద్మజ గారి చిత్రపటానికి పూజ కార్యక్రమాన్ని ముఖ్య అతిథుల చేతుల మీదగా జరిపించి, జ్యోతి ప్రజ్వలన తో కార్యక్రమాన్ని ప్రారంభించారు. తదుపరి స్వాగతం పాటతో చిన్నారులు తమ నృత్య ప్రదర్శనలతో అందరిని అలరించారు. యునైటెడ్ స్కూల్స్ ఆర్గనైజేషన్ వారిచే నిర్వహించిన ఆన్లైన్ నృత్య ప్రదర్శన పోటీలలో విజయం సాధించిన మధులత, సుమియా, హాజీర, అక్షయ, అఖిల్, చరణ్ చిన్నారులకు డీస్పీ పావని , కృష్ణ కిశోర్, ఉదయ్ మోహన్ రెడ్డి చేతులమీదుగా సర్టిఫికెట్లు, షీల్డ్ , మెడల్స్ అందజేశారు. మొదటిగా మదనపల్లి డీస్పీ పావని మాట్లాడుతూ ఇంతమంది దివ్యాంగులకు, వృద్ధులకు సేవలను అందిస్తున్న వెలుగు సెక్రటరీ యం. ఉదయ్ మోహన్ రెడ్డిని కొనియాడారు. తరువాత బ్రిలియంట్ స్కూల్ కరెస్పాండెంట్ యం. సహదేవ్ రెడ్డి మాట్లాడుతూ నార్మల్ పిల్లలనే కంట్రోల్ చేయడం చాలా కష్టం అలాంటి ఇంత మంది దివ్యాంగులకు సేవను అందిస్తున్న యజమా న్యులకు , సిబ్బందికి ఎంతో ఓపిక అని కొనియాడారు. అనంతరం దివ్యాం గులు రకరకాల నృత్య ప్రదర్శనలతో ఆహుతులను అలరించారు. చివరిగా మదనపల్లి రెండవ టౌన్ పోలీస్ స్టేషన్, రైటర్ రామ్మూర్తి వెలుగు సంస్థ స్థాపించి 29 సం.లుగా దివ్యాంగులకు, వృద్ధులకు అందిస్తున్న సేవల ను కొనియాడుతూ వెలుగు సెక్రటరీ యం.ఉదయ్ మోహన్ రెడ్డిని శాలువాతో సత్కరించారు. చిన్నారులు, వారి తల్లిదండ్రులు, ముఖ్య అతిధులు అందరూ ప్రేమ విందులో పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో డీస్పీ పావని, అసిస్టెంట్ డైరెక్టర్ కృష్ణ కిశోర్, కరెస్పాండంట్ యం. సహదేవ్ రెడ్డి, బ్రిలియంట్ స్కూల్ ప్రిన్సిపాల్ రజిత, వెలుగు ప్రెసిడెంట్ రమణరావు, వెలుగు సెక్రటరీ యం. ఉదయ్ మోహన్ రెడ్డి, ట్రెజరర్ రఘునాథ్ రెడ్డి, వెలుగు ఓల్డ్ ఏజ్ హోమ్ సూపరింటెండెంట్ ఉదయ్ కుమార్ రెడ్డి, ఈ.సి మెంబెర్ సుజాత, లీగల్ అడ్వైజర్ బాలజ్యోతి, కన్వీనర్ భాగ్యలక్ష్మీ ప్రిన్సి పాల్ లీనా కుమారి , సోషల్ వర్కర్ గీత , వార్డెన్ స్వీటీ , వెలుగు సిబ్బంది, వృద్ధులు, చిన్నారులు , వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ మలేరియా దినోత్సవం



కలికిరి, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:

మండలంలోని మేడికుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా.కావ్యగంధ, కలికిరి సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డా.పవన్‌కుమార్, డా.ఉదయ్‌కిరణ్, డా.సిమ్రాన్, డా.మెహజెబీన్ తాజ్, డా.బషీర్ అహ్మద్‌ల ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ మలేరియా దినోత్సవం నిర్వహించారు. అనంతరం పురవీధుల్లో ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. మలేరియా నిర్మూలనకు ప్రతిజ్ఞ చేయడం జరిగింది. మలేరియా మరియు ఇతర కీటక జనిత వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి ముబీబ్ బాషా, హెల్త్ సూపర్‌వైజర్లు సుధాకర్, గిరిజమ్మ, టీబీ సీనియర్ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్ నాగిరెడ్డి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతు రికార్డు ఆధారంగా రీ సర్వే జరగాలి

### సిపిఐ నాయకులు డిమాండ్




సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

మదనపల్లి ఏప్రిల్ 25 ప్రభాతవార్త

సిపిఐ మదనపల్లి నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో స్థానిక ఎస్టియు కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించడం జరిగింది, సమావేశానికి ముఖ్య అతిథిగా సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వలరాజు, జిల్లా కార్యదర్శి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి పి మహేష్ మాట్లాడుతూ రీ సర్వే కారణంగా గ్రామాల్లో రైతుల మధ్య కక్షలు పెరుగుతున్నాయని, ఏ పోలీస్ స్టేషన్లో చూసిన భూ వివాదాలే వస్తున్నాయని, రీ సర్వే రెవెన్యూ అధికారులకు సర్వేర్లకు ప్రధాన ఆదాయ వనరుగా మార్చుకున్నారని ఈ రీసర్వే లో అనేక లొసుగులు ఉన్నాయని ఇవి రైతులను మరింత నష్టపరిచే విధంగా ఉన్నాయని అన్నారు. రైతుకు తనకున్న భూ హక్కును ఆధారంగా కాకుండా అనుభవం ఆధారంగా హక్కులు కల్పించడం దుర్మార్గమన్నారు. అనుభవం ఆధారంగా హక్కు కల్పిస్తే బలహీన వర్గాలు, బలహీన రైతులు నష్టపోతారని బలమున్న, డబ్బున్న, దౌర్జన్య చేసేవారికి ప్రయోజనం కలుగుతుందన్నారు. ఎల్పిఎం నెంబర్ల వల్ల గందరగోళం ఏర్పడుతుందని, భూములు గుర్తించడానికి రైతుకు రెవెన్యూ అధికారులకు ఇద్దరికీ కూడా సమస్యగా మారుతుంది అన్నారు. గతంలో ఐదు లింకులు అలవెన్స్ ఉంటే రీ సర్వేలో 5 శాతం మలవెన్స్ ప్రకటించడం సరైనది కాదన్నారు. రైతులకున్న డాక్యుమెంట్ ఆధారంగా రీ సర్వే చేయాలని, ఐదు శాతం అలవెన్స్ తగ్గించాలని ఎల్పిఎం సిస్టం పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి టి కృష్ణప్ప, నియోజకవర్గ కార్యదర్శి మురళి పట్టణ కార్యదర్శి మాధవ్, మొలకలచేరువు మండల కార్యదర్శి అంజనప్ప తదితరులు పాల్గొన్నారు.

## తంబళ్లపల్లెకు టిడిపి ఇన్చార్జిని నియమించాలి

### కొసెట్టి వెంకటరమణ



తంబళ్లపల్లె ఏప్రిల్ 25 ప్రభాతవార్త ః

తంబళ్లపల్లె నియోజకవర్గం తెలుగుదేశం పార్టీకి ఇంచార్జి లేకపోవడంతో కార్యకర్తలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానిక సంస్థలు ముంచుకొస్తున్న వేళ వెంటనే ఇంచార్జి నియమించి పార్టీని ముందుకు తీసుకెళ్లాలని టిడిపి జిల్లా కార్యదర్శి సీనియర్ నాయకుడు కొసెట్టి వెంకటరమణ, మండల బీసీ నాయకుడు పురుషోత్తం, మహిళా నాయకురాలు రామలక్ష్మమ్మ కోరారు. ఈ విషయమై టిడిపి నాయకులు, కార్యకర్తల సంతకాలతో కూడిన వినతి పత్రాన్ని టిడిపి జాతీయ అధ్యక్షుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఫ్యాక్స్ ద్వారా పంపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్ల వైకాపా పాలనలో టిడిపి నాయకులు, కార్యకర్తలు వారి దౌర్జన్యాలు, అక్రమ కేసులు, భూ దందాలు, అన్ని రకాల దోపిడీలతో నరకం చూసామని నేడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ఎలాంటి ప్రయోజనం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తంబళ్లపల్లెలో ఇన్చార్జి లేకపోవడంతో వైకాపా నాయకుల ఆగడాలు మితిమీరుతున్నాయని ఇప్పటికైనా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తంబళ్లపల్లి నియోజకవర్గంలో దృష్టి సారించి మీరు ఎవరికి ఇంచార్జ్ బాధ్యతలు అప్పజెప్పిన శిరోధార్యంగా వ్యవహరిస్తామని వినతి పత్రంలో తెలిపారు.

## పశువైద్యులందరికీ ప్రపంచ పశువైద్య దినోత్సవ శుభాకాంక్షలు

### మంత్రి మండిపల్లి



రాయచోటి ఏప్రిల్ 25 ప్రభాతవార్త:

రాష్ట్ర రవాణా యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పశువైద్యులందరికీ ప్రపంచ పశువైద్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో పాడి పరిశ్రమది కీలక పాత్ర. రైతన్నకు వెన్నెముకగా నిలిచే పశువుల ఆరోగ్యాన్ని కాపాడుతూ, నిరంతరం సేవలందిస్తున్న పశువైద్యులకు సెల్యూట్ చేస్తున్నా అన్నారు. మన ప్రభుత్వ హయాంలో పశువైద్య సేవలను మరింత చేరువ చేసేందుకు, మౌలిక సదుపాయాల కల్పనకు మేము కట్టుబడి ఉన్నాం అన్నారు. ఎన్డీయే ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో పశుసంవర్ధక శాఖను మరింత బలోపేతం చేస్తాం అని ఆయన పేర్కొన్నారు.

## మాలేనత్తం స్వర్ణ గ్రామకార్యాలయాలను ఆకస్మిక తనిఖీ చేసిన ఎంపిడిఓ 1 అన్నపూర్ణ



రామసముద్రం ఏప్రిల్ 25ప్రభాతవార్త

మండలంలోని మాలేనత్తం స్వర్ణ గ్రామకార్యాలయాన్ని శనివారం మండల మండల పరిషత్ అభివృద్ధి అధికారి 1 అన్నపూర్ణ ఆకస్మిక తనిఖీ చేసారు. తనిఖీలో భాగంగా స్వర్ణ గ్రామ సిబ్బంది హాజరును పరిశీలించినారు. అలాగే ప్రభుత్వం ద్వారా నిర్వహించే వివిధ రకాల సర్వేల ప్రగతిని సిబ్బందితో సమీక్షించారు. ఆమె సిబ్బంది తో మాట్లాడు తూ గ్రామ పంచాయతీలో బకాయ పన్నుల వసూళ్లు ఈనెల లోపల వసూళ్లు చేయాలని, ప్రతి ఇంటికి వెళ్లి పి 4 సర్వే, ఈ కే వై సి, చెత్త సేకరణ పూర్తి చేయాలని పంచాయతీ అభివృద్ధి అధికారి ఇర్ఫాన్ కు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నా ఎంపిడిఓ 1అన్నపూర్ణ పంచాయతీస్వర్ణ గ్రామ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అలాగే మండల కేంద్రంలో ని ఆంజనేయ స్వామి కాలనీలో పంచాయతీ సెక్రటరీ మునిస్వామి నాయక్ తో డ్రైనేజి కాలువలను పరిశీలించి దోమలకు పిచికారీ చేశారు.

## రావణుడిపై శివపార్వతుల చిద్విలాపం



చౌడేపల్లి, ఏప్రిల్ 25 ప్రభాతవార్త

అ బీ. ష్ట ద. మృత్యుంజయేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శని వారం శివపార్వతులు రావణుడిపై ఊరేగారు. ఆలయ ప్రధా నార్చకుడు రాజశేఖర్‌దీక్షితులు, శివకుమారస్వామి, మహేష్‌ల ఆధ్వర్యంలో స్వామివారికి విశేషాభిషేకం, అలంకరణ గావించారు. రాత్రి వినాయకస్వామి సమేత శివపార్వతులు రావణవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. వాహనసేవకు సజ్జనకులస్తులు ఉభయదారులుగా వ్యవహరించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయము, వాహనాలను వివిధ రకాల పుష్పాలు, విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు

